ఆర్టీసీ బస్సులు బంద్

- స్కూళ్లకు సెలవులొస్తే బస్సులకూ సెలవే
- మహాలక్ష్మి పథకానికి మహిళలు దూరం
- ఇబ్బందులు పడుతున్న జనం


బస్సు కోసం నిరీక్షిస్తున్న జనం

రేగోడ్(మెదక్): ప్రతీ గ్రామానికి బస్సు సర్వీసులను పంపించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కలి ్పంచాలన్న ప్రభుత్వ ఆదేశాలకు గండికొడుతు న్నారు ఆర్టీసీ బస్సు డిపో అధికారులు. గత నెల 15 రోజులుగా బస్సు సర్వీసులను బంద్ చేయడం వలన ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్కూళ్లకు సెలవులొస్తే.. బస్సులకు సెలవులివ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేగోడ్ మండల కేంద్రం నారాయణఖేడ్ ఆర్టీసీ బస్సు డిపోకు సుమారు 12 కిలోమీటర్ల దూరం ఉంది. ఖేడ్ నుంచి రేగోడ్ మీదుగా జోగిపేట వైపు రోజూ ఉదయం బస్సు సర్వీసు ఉంది. గత నెల పదిహేను రోజుల నుంచి బస్సు సర్వీసును నిలిపివేశారని ప్రయాణికులు తెలిపారు. నిత్యం వచ్చే బస్సు రాకపోవడంతో ఉచిత ప్రయాణంపైనే ఆశలు పెట్టుకున్న మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు నిలిపివేశారని తెలియక మొన్నటి వరకు మహిళలు గంటల కొద్దీ బస్సు కోసం నిరీక్షించారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో.. బస్సును రద్దు చేసినట్లు తెలుస్తోంది. మెదక్ ఆర్టీసీ బస్సు డిపో నుంచి రేగోడ్‌కు నిత్యం రెండు పూటల బస్సు సౌకర్యం ఉంది. ఈ బస్సు కూడా రావడం లేదని స్థానికులు చెప్తున్నారు.సు మారు ఇరవై ఏళ్లకు పైగా రేగోడ్ నుంచి 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంగారెడ్డి ఆర్టీసీ అధికారులు రేగోడ్ వరకు బస్సు నడుపుతున్నారు. రేగోడ్‌కు కేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖేడ్ ఆర్టీసీ అధికారులు రేగోడ్ మీదుగా బస్సు ఎందుకు నడపడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నా.. ఇక్కడ మాత్రం అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి ఖేడ్, మెదక్ ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతూ.. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పై విషయమై ఖేడ్ ఆర్టీసీ బస్సు డిపో డీఎం మల్లేశయ్యకు వివరణ కోరగా.. స్కూళ్లకు సెలవులివ్వడంతో బస్సు సర్వీసును బంద్ చేశామని నిర్లక్ష్యంగా వివరణ ఇచ్చారు.

బస్సు వస్తలేదు



బస్సు కోసం చాలా సేపటి నుంచి ఎదురు చూస్తున్న. బస్సు వస్త నేలేదు. వస్తదో రాదో కూడా తెలియదు. బస్సు లేకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నాం. ఆటోలకు పోతే మస్తు పైసలు అవుతున్నాయి.

– గంసీబాయి, బురాన్‌వాడీ తండా

క్లుప్తంగా

జెండా ఆవిష్కరణ


రామాయంపేటలో జెండా ఎగురవేస్తున్న నాగరాజు

రామాయంపేట(మెదక్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు రామాయంపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు నాగరాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్ గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, నాయకులు పుట్టి యాదగిరి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

బీటీరోడ్డు వేయండి


మట్టిరోడ్డును చూపుతున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి అనంతుని వాగు వద్ద ఉన్న మట్టి రోడ్డును బీటీగా మార్చకుంటే హైదరాబాద్‌లోని ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన మెదక్ బొడ్మట్‌పల్లి రోడ్డుపై అనంతుని వాగు వద్ద మాట్లాడుతూ.. బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం 2023లో పూర్తి కావాల్సి ఉండగా, ఇంత వరకు మట్టిరోడ్డును బీటీగా మార్చలేదన్నారు. పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్, పాపన్నపేట మండలాల ప్రజలు జిల్లా కేంద్రం మెదక్ వెళ్తుంటారని చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలంలో మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడి, లోతు తెలియక అనేక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే 15 రోజుల్లో రోడ్డు వేయకపోతే హైదరాబాద్‌లోని ఆర్ అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పరామర్శ

నర్సాపూర్: బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేశ్‌గౌడ్‌ను బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు సోమవారం పరామర్శించారు. చిన్నరమేశ్ తల్లి యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో రఘునందన్‌రావు బీజేపీ నాయకులతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, పార్టీ నాయకులు రమణరావు, ఆంజనేయులు గౌడ్, సతీష్‌యాదవ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

తూప్రాన్‌లో వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన వ్యక్తి నాగులు

తూప్రాన్: ఇంటి నుంచి ఆరు రోజుల క్రితం వెళ్లి వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న నాగులు(42) అనే వ్యక్తి ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. గత నెల 28న ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి చేరుకోలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా.. ఎలాంటి ఆచూకీ లభించడంలేదని భార్య శిరీషా సోమవారం చేసిన ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అపరిచితుల మాటలు నమ్మొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్లు వికాస్, రాఘవులు కోరారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఏటీఎం సేవలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపరిచితుల మాటలను నమ్మి ఓటీపీ వంటి వివరాలను చెప్పొద్దన్నారు. అపరిచితులు ఫోన్‌లో అడిగే ప్రశ్నలకు వివరాలు చెప్పి బ్యాంకు ఖాతాలోని డబ్బులను పోగొట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి, మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు, బ్యాంకు మేనేజర్ జెమ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తరలిన ఎక్సైజ్ స్టేషన్

హుస్నాబాద్: హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ప్రస్తుతం ఉన్న గాంధీ చౌరస్తాలోని భవనం నుంచి, 6వ వార్డు ఎల్లంబజార్‌లోని మరో భవనంలోకి తరలించినట్లు ఎక్సైజ్ సీఐ పవన్ సోమవారం తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


ఫైజాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పంపిణీ చేసిన సైకిళ్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాలు, తండా నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు హెచ్‌సీజీ (హైదరాబాద్ సైకిల్ గ్రూప్) బృందం సోమవారం 22సైకిళ్లు పంపిణీ చేసింది. మండలంలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాలకు అజ్జమర్రి గ్రామం నుంచి 20 మంది, ఫైజాబాద్ తండా నుంచి ఇద్దరు బాలికలు ఫైజాబాద్ ఉన్నత పాఠశాలకు ప్రతీ రోజు 3 కిలోమీటర్ల నడుచుకుంటూ వస్తారు. దీంతో సైక్లింగ్‌డే పురస్కరించుకొని హెచ్‌సీజీ బృందం విద్యార్థినులకు 22 సైకిళ్లు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం తారాసింగ్ తెలిపారు. దీంతో విద్యార్థులకు సౌకర్యంగా మారనుందన్నారు. హైదరాబాద్ నుంచి ఫైజాబాద్‌కు సైకిళ్లను తీసుకొనివచ్చేందుకు అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి సహకరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, శేఖర్, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం


ధ్వంసమైన ప్రధాన ద్వారం పరిశీలిస్తున్న ఎస్ఐ బాలరాజు

వెల్దుర్తి(తూప్రాన్): మండలకేంద్రం మాసాయిపేటలోని సాయిబాబా మందిరంలో ఆదివారం అర్ధ రాత్రి చోరీకి ప్రయత్నం చేశారు. ముసుగు ధరించిన దుండగుడు ఆలయం వద్దకు చేరుకొని ఆరుబయట ఉన్న విద్యుత్ లైట్‌లను ఆర్పేసి ప్రధాన ద్వారాన్ని ధ్వంసం చేశాడు. లోపలి నుంచి వేసిన గడియను రంపం వంటి ఆయుధంతో కట్ చేశాడు. అనంతరం లోపలికి ప్రవేశించిన దుండగుడు ఆలయంలోని రెండు బీరువాలతో పాటు హుండీ తెరవడానికి విశ్వ ప్రయత్నాలు చేశాడు. అవి ఎంతకు తెర్చుకోకపోవడంతో అక్కడి నుండి ఖాళీ చేతులతో వెనుదిరిగి వెళ్లిపోయాడు. వేకువజామున పూజలు చేయడానికి వచ్చిన అర్చకుడు అంజనీగౌతమ్ చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి సమాచారం అందించారు. చైర్మన్, కమిటీ సభ్యులు ఆలయాన్ని సందర్శించి, ఆలయంలోని బీరువాలో చూడగా సాయిబాబా వెండి కిరీటం, విగ్రహం ఎదుట సుమారు మూడున్నర కిలోల వెండి విగ్రహం, పాదుకలు, హారతిపళ్లెం వంటి వస్తువులు యథావిధిగా ఉన్నట్లు గుర్తించారు. చైర్మన్ ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేగుంట ఎస్ఐ బాలరాజు చేరుకొని క్లూస్ టీం సాయంతో వివరాలు సేకరించారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. చోరీకి ప్రయత్నించిన తతంగం మొత్తం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉంది.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. మండల పరిధిలోని కొంతాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో 1997 – 98 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఒక చోట కలుసుకున్నారు. మండలంలోని ఓ ఫంక్షన్ హాల్లో సమ్మేళనం నిర్వహించి, అప్పటి గురువులను సన్మానించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఘనంగా హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ పుట్టిన రోజు వేడుకలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇతర నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలు మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెదక్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో..

మెదక్ మున్సిపాలిటీ: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలను మెదక్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ హేమలత, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి,జెడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేశారు.

హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

శివ్వంపేట(నర్సాపూర్): సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావును శివ్వంపేటకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ తదితరులు ఉన్నారు.

తూప్రాన్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును తూప్రాన్ బీఆర్ఎస్ శ్రేణులు కలిసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, సత్యలింగం, సత్తర్, నూరి తదితరులు ఉన్నారు.

పిల్లలను బడికి పంపండి


చిన్నశంకరంపేటలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): 30 నెలలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ ప్లే స్కూల్‌కు పంపించాలని కోరుతూ చిన్నశంకరంపేటలో బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే ప్లే స్కూల్‌లో చిన్నారుల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. చిన్నారులకు పోషకాహారంతో అందించడంతో పాటు పాఠశాలపై శ్రద్ధ పురిగేల కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం-3 టీచర్ నాగరాణి, చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలతో మొలకెత్తని విత్తనాలు

పాపన్నపేట(మెదక్): కరెంట్ కోతలతో జీలుగ, పెద్ద జనుము విత్తనాలు మొలకెత్తలేదని ఆరెపల్లి మాజీ సర్పంచ్ శ్రీనాథ్ వాపోయారు. తమ గ్రామంలో 15 రోజుల క్రితం కొంత మంది రైతులతో కలసి తాను పెద్ద జనుము, జీలుగ విత్తనాలు పొలంలో వేశానని తెలిపారు. అయితే వ్యవసాయానికి కరెంట్ సక్రమంగా ఇవ్వక పోవడంతో నీరు లేక ఎండి పోయాయని చెప్పారు. తమ గ్రామంలో వ్యవసాయానికి సరైన కరెంట్ ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై కరెంట్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా.. వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. సక్రమంగా కరెంట్ ఇవ్వకపోతే రైతులంతా కలసి సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మనోహరాబాద్(తూప్రాన్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మనోహరాబాద్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరబాద్‌కు చెందిన పత్రి యాదగిరి(40) గత నెల 27న గజ్వేల్‌కు మోపెడ్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో రంగాయిపల్లి గ్రామ శివారులో పాల అశోక్ అనే వ్యక్తి జాగ్రత్తలు తీసుకోకుండా పోసిన వడ్ల కుప్పను ఢీకొని యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే

దుబ్బాక: విద్యార్థులకు అందమైన చేతిరాతలో మెళకువలు నేర్పించి వారిని సమర్థులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నానని ప్రముఖ చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్ అన్నారు. గాయత్రి స్కూల్‌లో మే 25నుంచి జూన్ 3వరకు చేతిరాతపై నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందమైన చేతిరాతను అందరూ నేర్చుకోగలరన్నారు. వందలాది మంది చిన్నారులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలలో అందంగా రాయడంలో మెళకువలు నేర్పించామని చెప్పారు.

ర్యాలీలు, సంబరాలకు అనుమతిలేదు

- ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి


రంజిత్‌కుమార్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): పార్లమెంట్ ఎన్నికల ఓట్లలెక్కింపు మంగళవారం ఉన్నందున మండలంలోని గ్రామాలు, తండాల్లో ఎలాంటి సంబరాలు, ర్యాలీలు తీయొద్దని ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఓట్ల లెక్కింపు ఉన్నందున రాజకీయ నాయకులు, ప్రజలు, అభిమానులు ఎలాంటి సంబరాలు, ర్యాలీలు తీయవద్దని చెప్పారు. డీజేలు, బ్యాండ్‌లు పెట్టొద్దని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాల్లో గట్టినిఘా ఏర్పాటు చేశామన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్యాంక్ మేనేజర్

వెల్దుర్తి(తూప్రాన్): సహకార సంఘం బ్యాంక్ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ రవీందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వెల్దుర్తి బ్యాంక్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్న సేవల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 సం.లలోపు చిన్నారులకు సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకం వరంలాంటిదని అన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు డిపాజిట్‌లపై 8.25శాతం వడ్డీ వస్తుందన్నారు. డిపాజిట్‌లపై అధిక వడ్డీ ఇచ్చే బ్యాంక్ సేవలను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సిద్ధయ్య, చైర్మన్ అనంతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జనుము, జీలుగ విత్తనాల పంపిణీ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులకు సోమవారం జనుము, జీలుగ విత్తనాలను వ్యవసాయ అధికారులు అందజేశారు. స్థానిక రైతువేదికలో రైతులకు టోకెన్లు కేటాయించి విత్తనాలను అందజేశారు. మండలానికి జనుము 100 బస్తాలు, జీలుగ 100 బస్తాలు వచ్చినట్లు ఇన్‌చార్జి ఏఓ రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్సిడీపై జనుము 40 కిలోల బస్తా రూ.1448, జీలుగ రూ.1,116లకు అందజేశామన్నారు. రైతులు విత్తులు విత్తే సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు స్వాతి, మమత తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్‌లో అందుబాటులో జనుము విత్తనాలు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రానికి 70బస్తాల జనుము విత్తనాలు వచ్చినట్లు ఏఓ స్వప్న, ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ సోమవారం తెలిపారు. 40కిలోల బస్తా రూ. 3,620 కాగా ప్రభుత్వం సబ్సిడీపై రూ. 1,448 పంపిణీ చేస్తుందని చెప్పారు. ఒక ఎకరాకు 12కిలోలు సరిపోతాయని చెప్పారు. ఒక బస్తా మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు సరిపోతుందని వివరించారు. భూసారాన్ని పెంచుకునేందుకు ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

చెరువు కట్టపై జర పైలం


చెరువు కట్టపైన దారికి అడ్డుగా ముళ్ల చెట్లు

కొల్చారం(నర్సాపూర్): మండలంలో వారం రోజుల క్రితం గాలివాన దుమారం కారణంగా పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. మండలంలోని రంగంపేట నుంచి కోనాపూర్ వెళ్లే తురకల చెరువుకట్ట పైన ముళ్ల చెట్టు రహదారిపై పడడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అసలే వంపులు తిరిగిన రోడ్డు కావడం ఇటువైపులా ప్రయాణం సాగించే వారు ప్రమాద బారిన పడే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి.. ప్రయాణానికి అడ్డుగా మారిన చెట్టును తొలగించాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే స్కావేంజర్‌ను నియమించాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య


మాట్లాడుతున్న ఎస్టీయూ పోచయ్య

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణకు వెంటనే స్కావేంజర్స్‌ను నియమించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. సోమవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయాల నిధులు అందిస్తున్న ప్రభుత్వ స్కావేంజర్స్‌ను నియామకం చేయలేకపోతుందన్నారు. గత ఏడాది గ్రామపంచాయతీ వర్కర్స్‌కు పాఠశాల పారిశుద్ధ్య పనులు అప్పగించినప్పటికీ ఎక్కడ కూడా సరైన పని జరగలేదన్నారు. ప్రభుత్వం వెంటనే పాఠశాలల్లో ప్రత్యేకంగా స్కావేంజర్స్‌ను నియమించాలని కోరారు. అలాగే పాఠశాలల్లో 14 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేసి, పదోన్నతులు, నియామకాలు నిర్వహించాలని కోరారు. ఆయన వెంట ఎస్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జగన్‌లాల్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప కల్యాణం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కోనాపూర్ గ్రామంలో వెలిసిన బీరప్ప కామరతి కల్యాణ వేడుకలు భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. కురుమ సామాజిక వర్గానికి చెందిన అర్చకులు ఈ వేడుకలను సాంప్రదాయంగా జరిపించారు. అనంతరం స్వామివారి ఒగ్గు కథ వినిపించారు. స్వామివారి కల్యాణోత్సవాలకు కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మహిళా నాయకురాలు సుహాసిని రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు సంతోష్ రావు వేడుకలకు ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రంగంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, రవితేజరెడ్డి, తదితరులు ఉన్నారు.

అమరుల త్యాగాలను విస్మరించిన ప్రభుత్వం


దుబ్బాకలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని, అది గుర్తించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో వ్యవహరించడం తగదన్నారు. తెలంగాణ కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రాణాలు పణంగాపెట్టి పోరాడి సాధించారని, ఇప్పుడు ఆయనపై అవాకులు చెవాకులు మాట్లాడడం సహించరానిదని వాపోయారు. దుబ్బాక ఉద్యమకారుల అడ్డా అని, వారి కుటుంబాలను బీఆర్ఎస్ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి సతీమణి సుజాత, సతీష్‌రెడ్డి, మనోహర్‌రావు, రాజమౌళి, వెంకట నర్సింహారెడ్డి, కార్తిక, ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.